క్లుప్తంగా

బసవేశ్వరుడి సేవలో గురునాథ్‌రెడ్డి



గురునాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న వీరశైవ సంఘం సభ్యులు

కొడంగల్ రూరల్: బొంరాస్‌పేట మండలం రేగడిమైలారం గ్రామంలో శ్రీ బసవేశ్వర పునః ప్రతిష్ఠాపన కార్యక్రమానికి గురువారం రాష్ట్ర పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఆర్.గురునాథ్‌రెడ్డి హాజరై, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దూప దీప నైవేద్య అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు లోకూర్తి జయతీర్థాచారీ, గ్రామ వీరశైవ సంఘం సభ్యులు ఆయనకు శాలువా వేసి సన్మానించారు. అనంతరం పురోహితులు తీర్థప్రసాదాలు అందించారు.

ప్రజల అభిమానం మరువలేనిది



నూతన కార్యాలయంలో రోహిత్‌రెడ్డితో బీఆర్‌ఎస్ నాయకులు

తాండూరు: నియోజకవర్గ ప్రజల ప్రేమాభిమానాలు జీవితాంతం మరువలేనివని తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని రాఘవేంద్రకాలనీలో నూతనంగా నిర్మించిన ఆయన క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్తిరెడ్డి, రోహిత్‌రెడ్డి దంపతులతో పాటు పైలెట్ తల్లిదండ్రులు విఠల్‌రెడ్డి, ప్రమోదినిదేవిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నియోజవకవర్గం నుంచి పెద్దఎత్తున తరలి వచ్చిన ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులను కలిశారు.


పరిసరాల శుభ్రత పాటించాలి



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న పకీరప్ప

కొడంగల్ రూరల్: వర్షాకాలం నేపథ్యంలో పరిసరాల పరిశుభ్రతను పాటించాలని కొడంగల్ ఆస్పత్రి సబ్ యూనిట్ అధికారి ఎస్.పకీరప్ప అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, పట్టణ శివారులోని కేజీబీవీ విద్యాలయంలో మున్సిపల్ శానిటేషన్ సిబ్బందితో దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. అనంతరం విద్యార్థుల నుద్దేశించి ఆయన మాట్లాడారు. వర్షాకాలం సందర్భంగా మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. దోమలతో వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందన్నారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, మెదడు వాపు వంటి సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌ఓ స్రవంతి, ఉపాధ్యాయ సిబ్బంది లీల, జ్యోతి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీలు సహజం



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న నేతలు

పూడూరు: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని ఎక్కడ ఉన్నా మంచి పేరు తెచ్చుకోవాలని పాఠశాల హెచ్‌ఎం సుజాత అన్నారు. గురువారం మండలంలోని మన్నెగూడ జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ప్రసన్నను పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు సన్మానించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ.. సమాజంలో ఉపాధ్యాయుడికి దక్కిన గౌరవం మరెవరికి దక్కదన్నారు. బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు ఆదిల్, దయానంద్, జావిద్, గౌస్‌పటేల్, అజీంపటేల్, బాలమణి, హసీబ్, సిరాజ్, ఉపాధ్యాయులు రత్న, మధుకర్‌రెడ్డి, ప్రశాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిగిలో భారీ వర్షం

పరిగి: మండల కేంద్రంలో గురువారం భారీ వర్షం కురిసింది. గంట పాటు ఏకధాటిగా వర్షం కురవడంతో చెరువులు, కుంటల్లోకి వరద నీరు చేరింది. అంతే కాకా పట్టణ కేంద్రంలోని బహార్‌పేట్ కొడంగల్ చౌరస్తాలో వర్షం నీరు రోడ్డుపై నిలవడంతో కొంతసేపు వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. వర్షం పడినప్పుడల్లా రోడ్డుపై నీరు నిల్వకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు పేర్కొంటున్నారు.

గిరిజన గ్రామాలు.. వెళ్లాలంటే అవస్థలు!

మారుమూల పల్లెకు రహదారి సౌకర్యం కల్పిస్తామన్న ప్రభుత్వ హామీలు నీటిమీద రాతలుగా మారాయి. మండల కేంద్రానికి అనుసంధానం చేస్తామన్న వాగ్దానం కేవలం కాగితాలకే పరిమితమైంది. ఇప్పటివరకు మండల పరిధిలో ఉన్న గిరిజన ఆవాసాలకు సరైన దారులు లేక మట్టి రోడ్లతో ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు.

- ఏళ్లు గడుస్తున్నా మట్టి రోడ్లపైనే ప్రయాణం
- వర్షా కాలంలో తీవ్ర ఇబ్బందులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



బురదమయంగా కాళమ్మ రోడ్డు



చెరువుముందలి తండాకు వెళ్లే రోడ్డు (ఫైల్)

కుల్కచర్ల: ఒక గ్రామం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే ఆ ఊరికి రహదారులు ఎంతో కీలకం. గ్రామంలో ఉన్న వనరులను బయటి ప్రాంతాలకు చేరవేయడం ద్వారా వ్యాపార లావాదేవీలు కొనసాగుతాయి. దీంతో గ్రామీణ కుటుంబాలు అభివృద్ధి దిశగా ముందుకుసాగే అవకాశం ఉంది. ముఖ్యంగా జిల్లాలో మారుమూల ప్రాంతాలలో ఒక్కటైన కుల్కచర్ల, చౌడాపూర్ మండలాలలో ఇంకా బీటీ రోడ్డు లేని గ్రామాలు ఎన్నో ఉన్నాయి. ప్రస్తుత వర్షాకాలంలో వాటిపై ప్రయాణించాలంటే నరకప్రాయంగా మారింది.

మట్టి రోడ్లతో ఇక్కట్లు

కుల్కచర్ల మండలం కాళమ్మ ప్రాంతం నుంచి గిరిజన తండాలకు వెళ్లాలంటే మట్టి రోడ్డే దిక్కు. అలాగే పరిగి–మహబూబ్‌నగర్ రోడ్డు నుంచి గిరిజన తండాలకు వెళ్తుంది. ఈ రహదారి సుమారు నాలుగు కిలోమీటర్ల దూరం ఉంది. మళ్లీ ఆ రోడ్డు నుంచి ఇతర తండాలకు వెళ్లేందుకు మరొక కిలోమీటర్లు దూరం. ప్రస్తుతం ఆ రోడ్లన్నీ మట్టి రోడ్లే కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాళమ్మ గేటు నుంచి చెరువుముందలి తండా వరకు నేరేళ్లకుంట, టేకులతండా, ఎత్తుకాల్వ తండా, రోకటిగుట్ట తండాలను కలుపుకొంటూ ముందుకు సాగుతుంది. అదేవిధంగా ఇప్పాయిపల్లి–రాంపూర్ గ్రామాలకు మార్గం ఉంది.

కంకర తేలిన రోడ్లు

మండల పరిధిలోని మరికొన్ని గ్రామాలకు ఇప్పటికీ మట్టిరోడ్డు మీదనే ప్రయాణిస్తూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చాకల్‌పల్లి తండా, పటేల్ చెరువు తండా, సదన్ చెరువు తండా, బిండెంగడ్డ తండా, పుర్సంపల్లి, మల్కాపూర్ తదితర గ్రామాలకు వెళ్లాలంటే అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. ఈర్లవాగు తండా, లోక్య తండా, విఠలాపూర్ తండాలకు ఉన్న రోడ్డు సైతం కంకర తేలి ప్రయాణానికి ఆటంకం కలిగిస్తోంది.

అంతా బురదమయం



ఎన్నో ఏళ్లుగా మట్టి రోడ్లపై ప్రయాణిస్తూ ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలం వస్తే వెతలు మరింత ఎక్కువ అవుతున్నాయి. బైక్‌లతో ఈ రోడ్డుపై వెళ్లాలంటే సర్కస్ చేసినట్లు అవుతుంది. వేసుకున్న బట్టల నుంచి నడిపించే వాహనాలు సైతం బురదమయంగా మారుతున్నాయి.

– శ్రీనునాయక్, చెరువుముందలి తండా

ప్రజాప్రతినిధులు స్పందించాలి



బీటీరోడ్డు మంజూరైందని ఏళ్లుగా చెబుతున్నారు. కానీ ఆ రోడ్డును పట్టించుకునే నాథుడే లేడు. మట్టి చల్లి డబ్బులు సంపాదించుకోవడానికి మాత్రమే ఉపయోగించుకుంటున్నారు. ఎమ్మెల్యే, ఎంపీలు తమ ఆవేదనను అర్థం చేసుకొని బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలి.

– బాలునాయక్, స్థానికుడు, చెరువుముందలి తండా

కురుమల అభివృద్ధికి సమష్టి కృషి

సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు జగదీశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న జగదీశ్వర్

పెద్దేముల్: కురుమల అభివృద్ధికి కలిసి పని చేద్దామని తాండూరు నియోజకవర్గ కురుమ సంఘం అధ్యక్షుడు నాగారం జగదీశ్వర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కురుమ సంఘానికి తాండూరు పట్టణంలో 15 గుంటల భూమిని కేటాయించారన్నారు. ఇందులో ఫంక్షన్ హాల్ నిర్మించేందుకు అందరి సహకారం కావాలన్నారు. అనంతరం సంఘం ఉపాధ్యక్షుడు పాండు మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ పోరులో దొడ్డి కొమురయ్య ప్రాణాలు ఆర్పించారన్నారు. అలాంటి మహనీయుడి విగ్రహాలను ఊరూరా ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో కురుమ సంఘం డైరెక్టర్ పల్లె వెంకటేశం, నాయకులు నర్సింలు, హన్మయ్య, చిన్న నర్సింలు, స్వామి, రవిశంకర్, శేఖర్, రాఘవేందర్, రవీందర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

ఈ సమావేశంలో పెద్దేముల్ మండల కురుమ సంఘం అధ్యక్షుడిగా గోపాలకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా బాలు, ప్రధాన కార్యదర్శిగా రఘు, కోశాధికారిగా గోపాల్, సహాయ కార్యదర్శిగా అనంతయ్యలను ఎనుకున్నట్లు కురుమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు జగదీశ్వర్ ప్రకటించారు.

తల్లడిల్లిన 'తల్లిప్రేమ'



దెబ్బతాకిందా.. లేబిడ్డా: రోడ్డుపై పడిపోయిన కూనను లేపేందుకు ప్రయత్నిస్తున్న తల్లి



భయపడకు బిడ్డా జాగ్రత్తగా తీసుకెళ్తా: కుక్క పిల్లను నోట పట్టుకుని తీసుకెళ్తున్న తల్లి శునకం

తాండూరు టౌన్: గాయపడిన తన బిడ్డను కాపాడుకోవడానికి తల్లి కుక్క పరితపించిన తీరుకు స్థానికులు కళ్లు చెమర్చారు. తోటి శునకాల దాడిలో తల్లి, బిడ్డకు గాయాలయ్యాయి. దీంతో బిడ్డను నాలుకతో స్పృశిస్తూ లేపేందుకు యత్నించింది. కానీ బిడ్డ లేవకపోవడంతో దీనమైన అరుపులతో తల్లి కుక్క రోదించింది. అటుగా వెళ్తున్న స్థానికులు దగ్గరికి వెళ్లి చూసే సరికే కుక్క పిల్ల మృతి చెందింది. చూపరులను కలిచి వేసిన ఈ ఘటన తాండూరు పట్టణంలోని సాయిపూర్ రోడ్డుపై చోటు చేసుకుంది.

రుణమాఫీపై ఇంటింటి సర్వే



దుద్యాల్: రైతుల వివరాలను పరిశీలిస్తున్న ఏడీఏ శంకర్, ఏఈఓలు

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన రైతు రుణమాఫీని వందశాతం అమలు చేసేందుకు వ్యవసాయ అధికారులు ఇంటింటి సర్వే చేపట్టారు. బ్యాంకులో పంట రుణం తెచ్చుకొన్న రైతులకు రేషన్ కార్డులో పేర్లు లేకపోవడంతో కొంత మందికి మాఫీ కాలేదు. అందుకుగాను వ్యవసాయ అధికారుల వద్ద కుటుంబ సభ్యుల వివరాలను నిర్ధారణ చేస్తున్నారు.

ప్రత్యేక యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్న అధికారులు



దౌల్తాబాద్: ఈర్లపల్లిలో రుణమాఫీ కాని రైతు కుటుంబంతో సెల్ఫీ తీసుకుంటున్న ఏఓ

మోమిన్‌పేట: మండలంలోని ఎన్కేపల్లిలో 11మంది రైతుల పేర్లు రేషన్ కార్డులో లేకపోవడంతో మండల వ్యవసాయ అధికారి జయశంకర్ కుటుంబ సభ్యుల వివరాలు, ధ్రువీకరణ పత్రాలు ప్రత్యేక యాప్‌లో గురువారం అప్‌లోడ్ చేశారు. రేషన్ కార్డులో పేరు లేని రైతులు కుటుంబ సభ్యుల ఆధార్, పట్టాదారు పాసు పుస్తకాల జిరాక్స్‌లు అందుబాటులో ఉంచుకోవాలని ఆయన సూచించారు.

ఈర్లపల్లిలో 35 మంది..

దౌల్తాబాద్: రైతుల స్వీయ ధ్రువీకరణ తీసుకునేందుకు ఏఓ లావణ్యను నియమించారు. గ్రామాల వారీగా రూపొందించిన జాబితాలో పేర్లు ఉన్న రైతులకు ముందుగానే ఏఈఓలు సమాచారాన్ని అందజేస్తున్నారు. కేటాయించిన రోజున అధికారి వెళ్లి వివరాలు పరిశీలించి కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేస్తున్నారు. గురువారం ఈర్లపల్లిలో 35 మంది రైతుల వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేశారు.

హస్నాబాద్‌లో 40

దుద్యాల్: మండలంలోని హస్నాబాద్ గ్రామంలో గురువారం ఏడీఏ శంకర్ రాథోడ్ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే చేపట్టారు. దీంతో రుణాల మాఫీలో సమస్య ఉన్న రైతులు అధికారులకు విన్నవించారు. దాదాపు 40 మంది రైతుల వివరాలను పరిశీలించి ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేశారు.

క్రీడలతోనే మానసికోల్లాసం



పెద్దేముల్: పీడీ గౌరీ శంకర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దేముల్‌లో మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి

పెద్దేముల్: క్రీడలు మానసికోల్లాసానికి ఎంతో దోహద పడతాయని రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ గౌరీ శంకర్ అన్నారు. గురువారం పెద్దేముల్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో విశ్వ విఖ్యాత హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరీ శంకర్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువులతో పాటు తమకు నచ్చిన క్రీడల్లో పాల్గొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. హాకీ మాంత్రికుడిగా ఖ్యాతిని గడించిన ధ్యాన్‌చంద్‌ను క్రీడాకారులందరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ప్రధానోపాధ్యాయురాలు సునీత మాట్లాడుతూ.. క్రీడల్లో రాణిస్తే సమాజంలో మంచి గుర్తింపు పొందుతారన్నారు. ఉద్యోగాల్లో క్రీడాకారులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పీడీలు మధుసుదన్, రాధాకృష్ణ, గోపాల్, ఉపాధ్యాయులు నరేందర్‌రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో ఆసక్తి పెంచుకోవాలి

బంట్వారం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ఆసక్తి పెంచుకోవాలని ఎస్‌జీఎఫ్ జోనల్ సెక్రెటరీ ఎం.శివప్రసాద్ అన్నారు. గురువారం కోట్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో జాతీయ క్రీడల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడారు. క్రీడల దినోత్సవాన్ని పురస్కరించుకొని మూడు రోజుల పాటు విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఇలాంటి పోటీలతోనే విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ బయటికి వస్తుందన్నారు. విద్యార్థులు ప్రతిరోజు క్రీడలను ప్రాక్టీస్ చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ చంద్రప్ప, ఉపాధ్యాయులు బుచ్చిరెడ్డి, మోహన్, యాదవరెడ్డి, అంజయ్య, మల్లేశం, లక్ష్మణ్, మోహన్, వెంకటేశ్, ఫాతిమా బేగం తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్‌లో తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవం

కొడంగల్ రూరల్: జాతీయ క్రీడా దినోత్సవంతో పాటు తెలుగు భాషా దినోత్సవాలను గురువారం పాఠశాలలు, కళాశాలల్లో ఘనంగా జరుపుకొన్నారు. పలు పాఠశాలల్లో వ్యాస రచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. తెలుగు కవి గిడుగు వెంకట రామ్మూర్తి, భారత హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి వారి సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ ఇతర భాషలపై మమకారంతో తెలుగు భాషకు దూరం కావద్దని సూచించారు.

కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్

మొయినాబాద్‌రూరల్: దేశ భవిష్యత్‌ను రూపొందించడంలో సాంకేతిక విద్య ఎంతో ప్రాముఖ్యతను నొక్కి చెబుతుందని హరే కృష్ణ మిషన్ యూత్ ఎంపవర్‌మెంట్ హైదరాబాద్ హెడ్ బ్రజా బంధుదాస్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని జేబీఐఈటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఓరియంటేషన్ కార్యక్రమాన్ని విద్యా సంస్థల కార్యదర్శి జే.వీ.కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బంధుదాస్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నత విద్య ఎంతో విలువైనదని అందులో విద్యార్థులు నాలుగు సంవత్సరాల పాటు కష్టపడి చదివితే మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఇండియా పర్యాసా ఫ్రీడ్జ్ యూనిట్ హెడ్ అభిషేక్ లీడ్, ప్రిన్సిపాల్ కృష్ణమాచారి, క్యాంపస్ థియేటర్ రాజశేఖర్‌రెడ్డి, డీన్ అడ్మిన్ డాక్టర్ సలావుద్దీన్, భాస్కర ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, భాస్కర ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుమన్ పట్నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

షాబాద్: వినాయకుల నిమజ్జనాల కోసం షాబాద్ పహిల్వాన్ చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలించినట్లు షాబాద్ సీఐ కాంతారెడ్డి తెలిపారు. గురువారం షాబాద్ పహిల్వాన్ చెరువును ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. వినాయక నిమజ్జనం సందర్భంగా ఏ విధంగా చర్యలు చేపట్టాలన్న విషయంపై మాట్లాడారు. అదేవిధంగా చెరువులోకి విగ్రహాలు వచ్చే రహదారి, ఇతర ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని చెప్పారు. చెరువు వద్ద లైటింగ్ వేయాలని విద్యుత్ ఏఈ నరేందర్‌నాయక్‌కు సూచించారు.

సేవాలాల్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రవినాయక్

కొత్తూరు: సేవాలాల్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మున్సిపాలిటీ పరిధిలోని కొత్తూరు తండాకు చెందిన పాత్లావత్ రవినాయక్‌ను రాష్ట్ర కమిటీ ఎన్నుకుందని ఆయన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జనగాంలో జరిగిన సమావేశంలో భాగంగా తనను రాష్ట్ర కమిటీ సభ్యులు సన్మానించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబునాయక్, జాతీయ నాయకుడు లక్ష్మణ్‌నాయక్, ప్రేమ్‌చంద్, చిన్నబాబు, సంజీవ్, లక్పతినాయక్, వినోద్ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ మండల కార్యవర్గం ఎన్నిక

ధారూరు: పీఆర్‌టీయూ మండల నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్‌ల సమక్షంలో గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ధారూరులోని స్త్రీశక్తి భవన్‌లో సమావేశమైన సంఘం సభ్యులు గౌరవ అధ్యక్షుడిగా మల్లికార్జున్, అధ్యక్షుడిగా ఎం.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కె.మాణిక్యం, అసోసియేట్ అధ్యక్షుడిగా బి.శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఎ.సుధాకర్, ఎం.యశోదబాయి, కార్యదర్శులుగా బుచ్చయ్య, అంబికలను ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.



నూతన కార్యవర్గాన్ని సన్మానించిన నేతలు

కార్యక్రమంలో ఎంపీడీఓ నర్సింహులు, తహసీల్దార్ సాజిదాబేగంలు, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకుడే ముద్దు

కొడంగల్ రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం మట్టి వినాయకుల తయారీపై విద్యార్థినులకు శిక్షణ ఇచ్చారు. పాఠశాల హెచ్‌ఎం శ్యామలమ్మ, డ్రాయింగ్ మాస్టర్ తిరుమలేష్ మట్టి వినాయకుల తయారీపై మెలకువలు, విగ్రహాల ప్రయోజనాలను వివరించారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన విగ్రహాలు నీటిలో కరగవని, తెల్ల రంగులో ఉండే పాదరసం లెడ్ కాపర్ వంటి వాటితో జలాలు కలుషితం అవుతాయని విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మట్టి విగ్రహాలను వాడడం ఎంతో శ్రేయస్కరమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనంతలక్ష్మి, ప్రేమిల, అన్నపూర్ణ, సుధారాణి, విజయలక్ష్మి, రేణుకాబాయి, పీడీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



మట్టి వినాయకుల తయారీపై శిక్షణ ఇస్తున్న తిరుమలేష్

సంక్షిప్త వార్తలు

◆ అంత్యక్రియలకు ఆర్థికసాయం

దుద్యాల్: మండలంలోని హకీంపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త చాకలి గోపాల్ తల్లి వెంకటమ్మ అనారోగ్యంతో మృతి చెందగా మాజీ ఉప సర్పంచ్ సంజీవరెడ్డి అంత్యక్రియల కోసం రూ.పది వేలను గురువారం అందజేశారు. కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్ మాజీ వార్డు సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

◆ పూలే విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించండి

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటు చేసేందుకు స్థలం కేటాయించాలని బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను కోరారు. ఈ మేరకు గురువారం ఆయన వినతిపత్రం అందజేశారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు శుభప్రద్‌పటేల్ తెలిపారు.

◆ నేడు మన్నెగూడలో బీజేపీ సమావేశం

పూడూరు: మండల పరిధిలోని మన్నెగూడలో బీజేపీ కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నామని పార్టీ మండల అధ్యక్షుడు రాఘవేందర్ తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, దీనికి సినిమా సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేష్‌పటేల్, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మిట్ట పరమేశ్వర్‌రెడ్డి, సదానంద్‌రెడ్డిలు హాజరవుతున్నారని చెప్పారు. మండల పరిధిలోని వివిధ మోర్చాల అధ్యక్షులు, నాయకులు విధిగా హాజరుకావాలని తెలిపారు.

◆ విద్యార్థులను బడికి పంపించాలి

దోమ: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థి తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా బడికి పంపించేందుకు చర్యలు తీసుకోవాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు లాల్య నాయక్ సూచించారు. గురువారం మండలంలోని కిష్టాపూర్, బుద్లాపూర్ గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ పాఠశాలకు రాని విద్యార్థుల గురించి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్యార్థులకు యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, మధ్యాహ్న భోజన సౌకర్యంతో పాటు అనేక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. దీంతో తల్లిదండ్రులు పిల్లల చదువు పట్ల నిర్లక్ష్యం వహించకూడదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

◆ యాసతోనే భాషకు జీవం

బొంరాస్‌పేట: తెలుగులో ఉన్న యాసతోనే భాషకు జీవం పోసినట్లు అవుతుందని తెలుగు భాషోపాధ్యాయులు అన్నారు. గురువారం మండల పరిధిలోని ఆయా పాఠశాలల్లో వ్యవహారిక భాషోద్యమకారుడు గిడుగు వెంకట రామ్మూర్తి జయంతిని ఘనంగా నిర్వహించారు. తెలుగుభాష గొప్పతనం, వ్యవహార భాషాశైలిని పుస్తక రూపంలోని తీసుకురావడం అవసరమన్నారు. అనంతరం తెలుగుభాషపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

◆ హైమాస్ట్ లైట్లకు మరమ్మతు

అనంతగిరి: మున్సిపల్ పరిధిలోని విద్యుత్ దీపాలన్ని వెలగాలని మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుల్లపల్లి మంజులరమేశ్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈమేరకు గురువారం వికారాబాద్ మున్సిపాలిటీలోని ప్రధాన చౌరస్తాలో హైమాస్ట్ లైట్ల మరమ్మతులను ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వారం పది రోజుల్లో మరమ్మతులు పూర్తి చేయాలని, అవసరం ఉన్న చోట కొత్త వీధి దీపాలు బిగించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రమేశ్‌కుమార్, సిబ్బంది యాదయ్య, రాజు తదితరులు ఉన్నారు.

◆ విద్యార్థులకు నేత్ర పరీక్షలు



బొంరాస్‌పేట: చదువుకునే విద్యార్థులు టీవీ, మొబైల్ చూడటం కంటికి మంచిది కాదని వైద్యులు హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆర్‌బీఎస్‌కే బృందం అంధత్వ నిర్మూలన కోసం క్యాంపు నిర్వహించారు. పాఠశాలలోని ఆరు నుంచి పదో తరగతి చదివే 160 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. అందులో 26 మంది విద్యార్థులకు కళ్లజోళ్లు అందజేస్తామని వైద్యురాలు దివ్య తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం కాశయ్య, వైద్యులు నాగేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, అనిల్‌కుమార్, మల్లయ్య, వెంకటయ్య తదితరులున్నారు.